# సాక్షి
## వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 12 । నవంబర్ । 2023






**ఆర్చరీ జట్ల ఎంపిక**

కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. - 2లో



**ఢీకొన్న బైక్‌లు**

రెండు బైక్‌లు ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కడప నగరంలోని కడప-రాయచోటి రహదారిలో శనివారం చోటుచేసుకుంది. - 2లో

గరిష్టం/కనిష్టం
34.5/21.3

**వాతావరణం**

జిల్లాలో శనివారం 21.3 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్



## న్యూస్‌రీల్

### ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



అంజద్ బాషా



వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి చిహ్నంగా హిందువులు సంప్రదాయంగా జరుపుకునే దీపావళి ప్రతి ఇంటా కన్నుల పండువ కావాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీలు సి. రామచంద్రయ్య, డీసీ గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు శెట్టిపల్లె రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, పి. రవీంద్రనాథ్‌రెడ్డి, డా. దాసరి సుధ, డా. సుధీర్‌రెడ్డిలు ఆకాంక్షిచారు.

**జాగ్రత్తలు తీసుకోవాలని సూచన**

ఇంటింటా దీపాలు.. రంగుల వెలుగుల దీపపు కాంతులు.. శుభాలకు ప్రతిరూపాలుగా కనువిందు చేస్తాయన్నారు. ఈ పండుగలో.. ప్రధాన వస్తువులు అయిన నూనె, టపాకాయలు, నిప్పు వంటి వాటితో జాగ్రత్తగా వ్యవహరిస్తూ.. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

### నూతన నియామకం



తోటకృష్ణ



వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్ : రాయల్ కాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్‌ఆర్‌ఐ తోటకృష్ణ, కడప అసెంబ్లీ అధ్యక్షుడిగా ఏ. వెంకటేశ్వర్లును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. వీరాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి కాపునాడు అనుబంధ సంఘాలైన మహిళ కాపునాడు, యువ కాపునాడు, కాపునాడు మీడియా కో ఆర్డినేటర్లను నియమించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా తోటకృష్ణ, ఏ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు, గౌరవాధ్యక్షులు ఏ. అమరప్పలకు కృతజ్ఞతలు తెలిపారు.

### అరుణాచలం, శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు



రాజంపేట : కార్తీక మాసంలో అరుణాచలం, శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నామని డిపో మేనేజర్ గుండాల రమణయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్తీక దీపదర్శనం నిమిత్తం ఈనెల 26న ఆదివారం ఉదయం 6గంటలకు డిపో నుంచి బస్సు సర్వీసు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. రానుపోను చార్జి రూ.1130గా నిర్ణయించామన్నారు. అలాగే మూడురోజుల పంచారామాల దర్శనం చేసుకునేందుకు వీలుగా ఆర్టీసీ అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, కనకదుర్గమ్మ, మంగళగిరి నరసింహస్వామి టూర్ ప్యాకేజీ సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. టికెట్ రూ.3వేలు ఉంటుందన్నారు. రెండురోజుల టూర్‌ను ఖరారు చేసామని, ఇందులో శ్రీశైలం, మహానంది, నందవరం, యాగంటి, రవ్వలకొండలను దర్శనం చేయిస్తామన్నారు. రూ.1700 టికెట్ ధరగా నిర్ణయించామన్నారు. కార్తీకమాసాన్ని దృష్టిలో ఉంచుకొని నాలుగు వారాలు స్పెషల్ సర్వీసును నడుపుతున్నామన్నారు. భక్తులు రామయ్య (7382868300), ఆర్‌వీబీరాజు(7981738566) నంబర్లను సంప్రందించాలని డీఎం సూచించారు.

# సిరుల పట్టు

- జిల్లాలో పెరుగుతున్న పట్టుసాగు
- సిల్క్ సమగ్ర పథకంలో లబ్ధిదారులకు సబ్సిడీ
- రాయితీలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



ఊటుకూరులో సాగులో ఉన్న మల్బరీ నర్సరీ

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తరిస్తోంది. రైతులకు లాభాలు కరిపిస్తోంది. ప్రభుత్వం కూడా రాయితీలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. దీంతో చాలా మంది రైతులు పట్టు సాగు చేసేందుకు అసక్తి చూపుతున్నారు. అధికారులు సైతం పట్టు పురుగుల పెంపకానికి సంబంధించిన సలహాలు సూచనలను అందిస్తూ అండగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధికి సహకారం అందిస్తోంది. పట్టు పురుగుల పెంపంక మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతోంది.

ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు నర్సరీ కేంద్రాల్లో పెంపకాన్ని చేపట్టింది. కడప నగర శివార్లలోని ఊటుకూరు, మైదుకూరు మండలం వనిపెంట పట్టు పరిశ్రమలశాఖ క్షేత్రంలో మల్బరీ నర్సరీ సాగును చేపట్టారు. మొక్కలు కావాల్సిన రైతులకు ఒక్కో మొక్కను రెండు రూపాయలతో అందిస్తారు. ఈ ఏడాది జిల్లాలో 4 వందల ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటివరకు 250 ఎకరాల్లో సాగు చేశారు.

**మండలాల పరిధిలో...**

జిల్లాలోని పలు మండలాల పరిధిలో మల్బరీ సాగు చేపట్టారు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు మరింత పెరిగింది. మండలాల పరిధిలో 2023-24 సంవత్సరానికి 400 ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు వేంపల్లి, లింగాల, కొండాపురం, ముద్దనూరు, సీకేదిన్నె, ఖాజీపేట, చెన్నూరు. వనిపెంట, పోరుమామిళ్ల, సిద్దవటం, అట్లూరు, చక్రాయపేట మండలాల పరిధిలో 250 ఎకరాల్లో సాగు చేశారు. చాలా కాలంగా వర్షాలు లేక సాగు మందకొడిగా ఉన్నా ప్రస్తుతం జిల్లాలో వానలు పడుతుండటంతో సాగు మరింత పుంజుకోనుంది.

**లక్ష్యాన్ని సాధించేందుకు కృషి**



ఈ ఏడాది జిల్లాలో 4 వందల ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు 250 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలతో సాగు ఊపు అందుకోనుంది. త్వరలో లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నాం.

- అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి.

సిల్క్ సమగ్ర-2 పథకంలో యూనిట్ ఏర్పాటుకు సబ్సిడీ..

| యాక్టివిటీ | యూనిట్ విలువ (రూలలో) | కేంద్రంవాటా (రూలలో) | రాష్ట్ర వాటా (రూలలో) |
|---|---|---|---|
| మల్బరీ ప్లాన్టేషన్ | 25,000 | 16,250 | 6250 |
| షెడ్ నిర్మాణం | 4,00,000 | 2,60,000 | 1,00,000 |
| పరికరాలు | 75,000 | 48,500 | 18,650 |
| క్రిమి సంహారానికి | 5000 | 3250 | 1250 |
| **ఓసీ, బీసీ, ఇతరులకు** | | | |
| మల్బరీ ప్లాన్టేషన్ | 25,000 | 12,500 | 6250 |
| షెడ్ నిర్మాణం | 4,00,000 | 2,00,000 | 1,00,000 |
| పరికరాలు | 75,000 | 37,500 | 18750 |
| క్రిమి సంహారానికి | 5000 | 2500 | 1250 |

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ..

| యాక్టివిటీ | యూనిట్ విలువ | ఆర్‌కేవైసీ | లబ్ధిదారుడు |
|---|---|---|---|
| కూలింగ్ సిస్టమ్ రీడింగ్ షెడ్లు | 25000 | 22500 | 2500 |
| ప్లాస్టిక్ నేత్రికలు | 15000 | 13500 | 1500 |
| పామ్‌పాండ్స్ | 1,50,000 | 135000 | 1500 |
| షోలార్‌లైట్స్ | 50000 | 45000 | 5000 |
| పామ్ మెకనైజేషన్ | 100000 | 90000 | 10000 |
| **ఓసీ, బీసీ, ఇతరులు....** | | | |
| కూలింగ్ సిస్టమ్ రీడింగ్ షెడ్లు | 25000 | 12500 | 12500 |
| ప్లాస్టిక్ నేత్రికలు | 15000 | 7500 | 7500 |
| పామ్‌పాండ్స్ | 1,50,000 | 75000 | 75000 |
| షోలార్‌లైట్స్ | 50000 | 25000 | 25000 |
| పామ్ మెకనైజేషన్ | 100000 | 50000 | 50000 |

## విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి




మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను విద్యలో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులకు కృషి చేయాలని విద్యాశాఖ రాష్ట్ర పర్యవేక్షకురాలు కల్పన, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కడపలోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమశాఖలో పనిచేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లకు, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నిర్వహించిన రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలు తప్పకుండా చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియలను చేయగలిగేలా తీర్చిదిద్దడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ పురోగతికి, పేదరిక నిర్మూలనకు విద్య ఒక్కటే ప్రధానమార్గం అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నతస్థానాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ ధనలక్ష్మి, ఏఏఎంఒ రామాంజనేయరెడ్డి, జీసీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కురబలకోటలో మెరిసిన మోహనుడు

సీతా మాలక్ష్మి సినిమాతో.. స్థానికులకు అనుబంధం




చంద్రమోహన్ హీరోగా నటించిన సీతామాలక్ష్మి



కురబలకోట రైల్వే స్టేషన్‌లో సీతామాలక్ష్మి సినిమా సన్నివేశం (ఫైల్)

కురబలకోట : వైవిధ్య పాత్రలతో మెప్పించి.. నట విశ్వరూపం చూపిన చంద్ర మోహనుడితో కురబలకోట వాసులకు విడదీయరాని అనుబంధం ఉంది. అతడి మరణ వార్త విన్న ఆయన అభిమానులు ఉద్వేగానికి గురయ్యారు. అన్నమయ్య జిల్లా కురబలకోట రైల్వే స్టేషన్‌లో నాడు ఆయన చెప్పిన మాటలు.. చేసిన నటనను గుర్తు చేసుకున్నారు. కళా తపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో చంద్రమోహన్, తాళ్లూరి రామేశ్వరిలు సీతామాలక్ష్మి సినిమాలో నటించారు. కురబలకోట మండలంలోని తెట్టు, కురబలకోట రైల్వే స్టేషన్‌లో ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు నాడు చిత్రీకరించారు. ‘మావి చిగురు తినగానే కోవిల పలికేనా’ పాట చిత్రీకరణ కురబలకోట రైల్వే స్టేషన్‌లో జరిగింది. చిత్రంలో ఓ పాత్రధారి వెటకారం చేస్తూ ఏ ఊరు మీది అని ప్రశ్నించినపుడు చంద్రమోహన్ మాది మదనపల్లె వద్ద కురబలకోట అని చెబుతాడు. సినిమాలో డైలాగ్ విన్న కురబలకోట వాసులు అప్పట్లో ఊగిపోయారు. 1978 జూలై, 27న విడుదలై సంచలన విజయం సాధించిన ఈ సినిమా చంద్రమోహన్‌కు హీరోగా సినీ రంగంలో ఎదగడానికి అవకాశం ఇచ్చింది. ఈ సినిమా విజయంతో ఈ ప్రాంతంలో మరెన్నో సినిమాలు తీయడానికి చాలా మంది ముందుకు వచ్చారు. ఈ చిత్ర యూనిట్ తెట్టులోని కామకోటి ప్రసాదరావు ఇంట్లో బస చేశారు. ఒకటిన్నర నెలపాటు తెట్టు వేణుగోపాలస్వామి ఆలయం, గ్రామ పరిసర ప్రాంతాల్లోనే షూటింగ్ నిర్వహించారు.

శనివారం చంద్రమోహన్ మరణవార్త తెలుసుకోగానే.. కళ్లు చెమర్చారు. నాటి అభిమానులు ఆయన పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కురబలకోట రైల్వే స్టేషన్ రూపురేఖలు మారినా.. ఈ ప్రాంత వాసుల మనసుల్లో ఈ సినిమా చెక్కుచెదర లేదు.

# ఆజాద్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

కలెక్టర్ విజయరామరాజు



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో అల్ప సంఖ్యాక వర్గాల దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీ, నెహ్రూలతోపాటు ఆజాద్ చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. 1992లో ప్రభుత్వం భారత రత్న ప్రకటించిందని తెలిపారు. ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

మైనార్టీ సంక్షేమం కింద జిల్లాలో 2020-21లో 9157 మంది పోస్టుమెట్రిక్ విద్యార్థుల తల్లుల అకౌంట్‌లో రూ. 15.4 కోట్లు, జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా 10,561 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 15 కోట్లు జమ చేశామన్నారు. 2022-23 సంవత్సరంలో విద్యా దీవెన ద్వారా 6205 మంది పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ. 3.35 కోట్లు వారి తల్లుల అకౌంట్లలో జమ చేశారని తెలిపారు. విదేశీ విద్యా దీవెన ద్వారా ఒక విద్యార్థికి యూకేలో ఎంఎస్ ఇంజినీరింగ్ అభ్యసించేందుకు రూ. 14 లక్షలు అతని ఖాతాలో జమ చేశారన్నారు. 2023-24లో 335 నోటిఫైడ్ మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లకు నెలకు రూ. 10 వేలు చొప్పున, మౌజన్లకు రూ. 5 వేలు చొప్పున ఆయా మసీదుల ఖాతాల్లో జమ చేశారని వివరించారు. విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు హిదాయతుల్లా, మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ ఇమ్రాన్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష**

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కనుక వైద్యులు నిబద్ధతతో ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఆయన మాట్లాడుతూ కుష్ఠు, క్షయ కేసులను ప్రతినెల మొదటి వారంలో పరీక్షలు చేపట్టి మందులు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కేసులను నిర్లక్ష్యం చేస్తున్నారని, పీహెచ్‌సీ వైద్యులు రాసిన మందులనే ఇస్తున్నారంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ గుర్తింపు రద్దు చేస్తామన్నారు. విధులు నిర్వర్తించాల్సిన సమయంలో స్వంత క్లినిక్‌లలో పనిచేసే ప్రభుత్వ వైద్యులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

# సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్

**సిద్దవటం :** సిద్దవటం రేంజ్ మద్దూరు బీటులోని సమస్యాత్మక ప్రాంతాల్లో శనివారం తమ సిబ్బందితో కూంబింగ్ నిర్వహించామని రేంజర్ బి.కళావతి తెలిపారు. ఎక్కడా స్మగ్లర్ల ఆనవాళ్లు కనిపించలేదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, మద్దూరు బీటు అధికారిణి ధీపిక, ఏబీఓ నారాయణరెడ్డి, బేస్ క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని ఎర్రగుడిపల్లెకు చెందిన వెన్నపూస బాలకృష్ణారెడ్డి శనివారం మృతి చెందారు. ఆయన భార్య సుబ్బమ్మ, కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ సమాచారం ఇచ్చారు. నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు అక్కడికి చేరుకుని మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. నేత్రదానం చేసే వారు 9966509364 అనే ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



# ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్చరీ జట్ల ఎంపిక



ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్చరీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో శనివారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు.

**జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..**

**అండర్–14 బాలికలు :** ఇండియన్ రౌండ్: టి. సుశ్రుత, కె.నవ్యశ్రీ, జి. దీపిక, వి.మధులత.

**రికర్వ్‌రౌండ్ :** జి.సాత్విక, జి.వైష్ణవి, ఎన్.త్రివేణి, వి.వర్షిణి.

**కాంపౌండ్ రౌండ్ :** ఎస్. అనీషా, కె.ఎ.ఎస్.లేహ్యరెడ్డి, జి.లాస్యప్రియ, ఎస్.హలీమ.

**అండర్–14 బాలురు..**

**ఇండియన్ రౌండ్ :** సి.దినేష్‌కుమార్, ఎస్.శశివర్ధన్.

**రికర్వ్ రౌండ్ :** ఎల్. కౌశల్ దేవరాయల్, అరవింద్, శ్రీహరి చరణ్, టి.గణేష్.

**కాంపౌండ్ రౌండ్ :** సి. అభినయ్, ఓ.ఈరన్న, ఎన్. జ్ఞానతేజ, డి.మేఘవర్ధన్.

**అండర్–17 బాలికలు..**

**ఇండియన్ రౌండ్ :** ఇ. శివదుర్గ, జి. ఓబులశరణ్య, డి.శ్యామల, ఎన్. గ్రీష్మాంజలి.

**రికర్వ్‌రౌండ్ :** ఎస్.కె. గీతిక, పి. దీక్షిత, కె. పూజిత, ఎన్. నవనీత.

**కాంపౌండ్ :** ఎం.తేజశ్రీ, ఎస్.లక్ష్మిప్రియ, పి.సంగీత, ఎం.ఎన్.శివాంజలి.

**అండర్–17 బాలురు..**

**ఇండియన్ రౌండ్ :** ఎ. విశాల్, టి.శ్రీశాంత్, కె. హేమంత్, ఆర్.శ్రీనివాసులు.

**రికర్వ్‌రౌండ్ :** జి. భాస్కర్, జి.వీరేంద్ర, వై.నవనీష్, వె. యశ్వంత్‌రెడ్డి.

**కాంపౌండ్ రౌండ్ :** పి.వి.సాయిశ్రీనివాస, సి.లోకేష్, ఎస్. ప్రతాప్‌రెడ్డి, ఎస్.జాన్‌మైఖేల్.



## ఢీకొన్న బైక్‌లు



తీవ్రంగా గాయపడిన గురుప్రసాద్, మౌలాలీ

**కడప అర్బన్ :** రెండు బైక్‌లు ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కడప నగరంలోని కడప-రాయచోటి రహదారిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. కడప నగరం చిన్నచౌక్ పరిధిలో రామకృష్ణనగర్‌కు చెందిన జమ్మి గురుప్రసాద్ (40) సప్లయర్స్‌కు సంబంధించిన పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తనతోపాటు పని చేసే అజాద్‌నగర్‌కు చెందిన శివ (35)ను ఇంటి దగ్గరికి వెళ్లి తన మోటార్ సైకిల్‌లో ఎక్కించుకుని కడప నగరంలోకి బయలుదేరాడు. మరోవైపు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన పఠాన్ మస్తాన్ (20), మహమ్మద్‌గౌస్ (18), మౌలాలీ (16) అనే ముగ్గురు ఓ మోటార్ సైకిల్‌పై నగరంలోకి బయలుదేరారు. రైల్వే వంతెన దాటిన తరువాత శ్రీకృష్ణదేవాలయం కూడలిలో ఒకదాని వెనుక ఒకటి వస్తుండగా.. ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారు ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. బాధితులను రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని, రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని కడప తాలూకా సీఐ రాజా తమ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.



## టాటాఏస్ వాహనం బోల్తా

**అట్లూరు :** మండల పరిధిలోని కడప – బద్వేలు ప్రధాన రహదారిపై శనివారం టాటాఏస్ వాహనం బోల్తా పడింది. అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అట్లూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు మైదుకూరు మండలం చీపాడులో కాడెద్దులను కొనుగోలు చేసి టాటాఏస్ గూడ్స్ వాహనంలో తీసుకువస్తున్నాడు. అట్లూరు మండలం దేవనగర్ సమీపానికి వచ్చే సరికి టైరు పగిలిపోవడంతో వాహనం బోల్తాపడింది. అందులో ఉన్న ఎద్దులు రోడ్డు మీద పడ్డాయి. అలాగే డ్రైవర్‌తోపాటు అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. ఆ సమయంలో వస్తున్న వాహనదారులు ఎద్దులను రక్షించి, వాహనాన్ని తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.

## కారులో మంటలు



కాలిపోయిన కారు

**ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) :** మండల పరిధిలోని కల్లమల్ల, సున్నపురాళ్లపల్లి గ్రామాల మధ్య శనివారం కారులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. ప్రయాణికులు, డ్రైవర్ క్షేమంగా బయట పడటంతో ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీపీపీ ఉద్యోగి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కారులో ముద్దనూరు వైపు వెళ్తున్నాడు. కల్లమల్ల దాటి సున్నపురాళ్లపల్లెకు వెళ్తుండగా కారులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు ఎగసి పడ్డాయి. డ్రైవర్ అప్రమత్తమై కారును రోడ్డుపక్కన నిలిపేశాడు. అందులో ఉన్న వారందరూ బయటకు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైపోయింది.

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

**రాజుపాళెం :** మండలంలోని వాసుదేవాపురం గ్రామంలో ఈ నెల 2న ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ పి.సుబ్బారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాసిరెడ్డి కొండారెడ్డి (33) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. కడుపు నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుండే వాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 2వ తేదీన గడ్డికి పిచికారీ చేసే మందు తాగాడు. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం మొదట దువ్వూరు, ఆ తర్వాత ప్రొద్దుటూరు ఆసుపత్రుల్లో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపాడు. మృతుడికి భార్య పద్మావతి ఉన్నారు.



## ఉరి వేసుకొని విద్యార్థి ఆత్మహత్య

**గుర్రంకొండ :** చిన్నారుల మధ్య చెలరేగిన చిన్నపాటి వివాదం ఓ విద్యార్థి ప్రాణాల మీదికి వచ్చింది. చెల్లెలు ఏవో అన్నమాటలకు మనస్తాపం చెందిన అన్న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండలంలోని సరిమడుగు పంచాయతీ పుల్లావాండ్లపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం అనే మహిళకు రాయచోటి మాసాపేటకు చెందిన డి.నాగరాజుతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి శివసాత్విక్ సాయి(13), సంజన(11) అనే పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల నుంచి వీరు విడివిడిగా నివాసముంటున్నారు. శివసాత్విక్ సాయి తన తండ్రి నాగరాజు దగ్గరే ఉంటూ రాయచోటిలో ఎనిమిదవ తరగతి చదువుకొంటున్నాడు. సంజన తన తల్లితో కలసి పుల్లావాండ్లపల్లెలో ఉంటూ చదువుకుంటోంది. అప్పుడప్పుడు శివసాత్విక్ సాయి తల్లి దగ్గరికి వస్తూ పోతూఉండేవాడు. ఈ నేపథ్యంలో దీపావళిని పురస్కరించుకొని శనివారం శివసాత్విక్ సాయి తన తల్లి దగ్గరికి వచ్చాడు. అన్నాచెల్లెలు ఆడుకొంటుండగా.. ఇద్దరి మధ్య చిన్నపాటి వివాదం చెలరేగింది. దీంతో మనస్తాపం చెందిన శివసాత్విక్ సాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.